సాక్షి నంద్యాల

ఆదివారం । 19 । జనవరి । 2025



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శనివారం విశాఖపట్టణానికి చెందిన టి.లలితా శ్రీనివాస్ బృందం కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



పోటెత్తిన భక్తులు

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో ఒక్కరోజే వివిధ సేవల ద్వారా ఆలయానికి రూ.2,64,020 ఆదాయం వచ్చింది.



హోరాహోరీగా..

నీలకంఠేశ్వస్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం న్యూకేటగిరి విభాగం పోటీలు ముగిశాయి. 8లో▸

న్యూస్‌రీల్

డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ జావళి



బొమ్మలసత్రం: నంద్యాల సబ్‌డివిజన్ పోలీస్ అధికారిణిగా ఐపీఎస్ మందా జావళి ఆల్ఫోన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాను 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు సెలెక్ట్ అయ్యానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణకు కృషి చేస్తానన్నారు. అలాగే మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రత్యేకంగా టీం ఏర్పాటు చేసి రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు వెల్లడించారు.

గడ్డిమైదానాల పర్యవేక్షణకు ప్రత్యేక శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆత్మకూరు రూరల్: నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో గడ్డి మైదానాల పర్యవేక్షణకు నంద్యాల సర్కిల్ పరిధిలో ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్‌లో ప్రాజెక్ట్ టైగర్ ఆత్మకూరు డీడీ సాయిబాబా ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. గ్రాస్‌మాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి పొందిన డాక్టర్ ముర్తుకర్ నల్లమలలోని గడ్డి మైదానాలపై అధ్యయనం చేసి ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఈశిక్షణ కార్యక్రమాలు రూపొందించారు. భూమి స్థితి, రంగును బట్టి గడ్డి జాతుల ఎంపిక, సంవత్సర కాలవ్యవధి గల జాతుల ఎంపిక ,వన్యప్రాణులకు మేయడానికి అక్కరకు రాని కలుపు మొక్కల తొలగింపు, గడ్డి విత్తనాల సేకరణ తదితర అంశాలపై సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో నంద్యాల డీడీఅనురాగ్ మీన , శ్రీశైలం సబ్ – డీఎఫ్ఓ అబ్దుల్ రౌఫ్, ఎఫ్ఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్'ని సద్వినియోగం చేసుకోండి

నంద్యాల: జిల్లావ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం ఇంటర్న్ షిప్ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈనెల 21వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పోర్టల్ https://pminternship.mca.gov.in/login/ లాగిన్ అయి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ స్కీంలో ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పిస్తారన్నారు. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6వేలతో పాటు ప్రతి నెల రూ.5వేలు స్టైఫండ్ కూడా చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సీహెచ్ఎస్‌సీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీఫార్మసీ తదితర గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు 6300324076, 8297812530 నంబర్లను సంప్రదించాలన్నారు.

పనితీరు మార్చుకోకపోతే తొలగిస్తాం

● ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ హెచ్చరిక



షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్న పీడీ

వాగలమర్రి: పనితీరు మార్చుకోకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని డ్వామా పీడీ జనార్దన్‌రావు ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఏపీఓ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్లు బాలు నాయక్, రవి, మద్దిలేటి, నరసింహారెడ్డిల పనితీరును పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద ఈ ఏడాది కూలీలకు 2.85 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.65 లక్షల పని దినాలు మాత్రమే కల్పించారని, గోకులం షెడ్లు 20 మంజూరైతే వాటిలో 10 మాత్రమే పూర్తి చేశారని మండిపడ్డారు. ఇలా ప్రతి విషయంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అక్కడికక్కడే నోటీసులు జారీ చేశారు. మూడురోజుల్లో సమాధానం చెప్పి, పనితీరు మార్చుకోకపోతే తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏపీడీ సాంబశివారావు తదితరులు పాల్గొన్నారు.

హరిణి.. హరివిల్లులా!



సండే స్పెషల్

● నల్లమలలో అరుదైన జింకల సంచారం
● ఏడురకాల జింకలతో అలరారుతున్న జీవవైవిధ్యం
● పెద్ద పులి మెనూలో ఇవి ప్రధానం

తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అడవులంటేనే జీవ వైవిధ్యానికి పెట్టింది పేరు. ఏనుగు, సింహం తప్ప తక్కిన జంతువులన్నింటికీ ఈ అడవి ఆవాస ప్రాంతంగా నిలిచింది. 17 రకాల కార్నివోర్స్ (మాంసాహార జంతువులు), 8 రకాల హెర్బివోర్స్ (శాకాహార జంతువులు)తో పాటు పలు రకాల పక్షులు, సరీసృపాలు, చేపలు, ఉభయచర జీవులు, కీటకాలు తదితర జంతుజాలం ఈ అడవిలో సహజీవనం చేస్తూ బయోడైవర్సిటీకి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. 8 రకాల హెర్బివోర్స్‌లో ఏడు రకాలు జింకలే ఉండటం విశేషం. వీటిల్లో 300 కేజీల బరువు తూగే కణితి (సాంబర్), మనిమేగం(నీల్‌గాయ్) వంటి భారీ జింకలతో పాటు కుందేలు కంటే కాస్త చిన్నదిగా కనిపించే మౌస్‌డీర్ (మూషిక జింక) సైతం ఉన్నాయి. నాగార్జున సాగర్–శ్రీశైలం అభయారణ్యం పరిధిలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఇవి అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి.

– ఆత్మకూరురూరల్



అడవికే అందం..

పొడ దుప్పి (స్పాటెడ్ డీర్).. దీనిని చుక్కల దుప్పి అని కూడా అంటారు. జింకలలో అత్యంత అందమైనది. బంగారు వర్ణం చర్మంపై తెల్లటి మచ్చలతో అత్యంత లావణ్యంగా కనిపిస్తుంది. వీటిలో కూడా మగ వాటికి పంగలతో కూడిన కొమ్ములు ఉంటాయి. దుప్పులు కూడా తమ కొమ్ములను వదులుతుంటాయి. మగ దుప్పి అరిచే శబ్దాన్ని బట్టి వర్లుపోతు అనికూడా పిలుస్తారు. ఇవి అడవుల్లో అన్ని ప్రదేశాల్లో సంచరిస్తుంటాయి. పులి ఆహారంలో ఇది కూడా ఉంది.

మనిమేగం.. ప్రత్యేకం

నల్లమలలో ప్రధానంగా కనిపించే మరో అంటిలోప్ మనిమేగం (నీల్‌గాయ్). ఇది కూడా భారీ శరీరాన్ని కలిగి ఉంటుంది. కొంతమేర గుర్రాన్ని పోలి ఉండే మగ మనిమేగాలు వయస్సుకు వచ్చాక నల్లటి పైకప్పుతో కనిపిస్తాయి. అందుకే వీటిని నల్లపోతు అనికూడా అంటారు. కృష్ణజింకలు, మనిమేగాలు ఎక్కువగా సంచరిస్తున్నాయంటే అది అటవీ క్షీణతకు సంకేతంగా భావిస్తారు. ఎందుకంటే ఈ రెండు జింకలు పెద్దపెద్ద గడ్డి మైదానాల్లో మాత్రమే మనగలుగుతాయి.





జంగిల్ మే సవాల్..

గడ్డి మైదానాల్లో గుంపులుగా జీవించే జింకల్లో కృష్ణజింక (బ్లాక్ బక్) ప్రధానమైనది. మగ జింకలకు పొడవాటి కొమ్ములు ఉంటాయి. పురి తిరిగినట్లుండే ఈ కొమ్ములపైన ఉన్న పురులను బట్టి వాటి వయస్సును నిర్ధారిస్తారు. ఇవి బాగా వయస్సుకు వచ్చాక వాటి చర్మం నల్లటి కప్పును కలిగి అందంగా తయారవుతుంది. సాధారణంగా ఇలా బలంగా నల్లటి కప్పుతో కనిపించే కృష్ణజింక.. జింకల గుంపుకు నాయకత్వం వహిస్తుంది. అత్యంత వేగంగా పరిగెత్తే వీటిని వేటాడే మాంసాహార జంతువు నల్లమలలో లేదు అంటే అతిశయోక్తి కాదు. గంటకు 100 కి.మీ పైగా వేగంతో పరిగెత్తే చీతాలు దేశంలో కనుమరుగు కావడంతో వీటికి పోటీపడి పరిగెత్తే జంతువులు లేకుండా అయ్యాయి. తోడేల్లు, హైనాలు మాటువేసి వీటిని చంపుతుంటాయి. కృష్ణ జింక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక జంతువుగా ఉంది. పెద్ద గడ్డి మైదానమైన రోళ్లపాడు బట్టమేక పక్షి అభయారణ్యంలో ఇవి పెద్దసంఖ్యలో సంచరిస్తుంటాయి.

కొమ్ములతో కుమ్మేస్తూ..



తలపై రెండు, వనపై మరో రెండు చిన్న కొమ్ములు కలిగి ఉండడమే కొండ గొర్రె ప్రత్యేకత. ఈ కారణంగానే కొండగొర్రెను చౌసింగా అని కూడా పిలుస్తారు. నల్లమలలోని కొండ తిప్పలపై నివసించే ఈ వన్యప్రాణి ఉనికి దట్టమైన పచ్చటి అడవికి గుర్తుగా చెప్పుకోవచ్చు. కొండగొర్రె తనను తాను మాంసాహార జంతువుల నుంచి రక్షించుకునేందుకు కొండకొమ్ముల ఏటవాలును వీలుగా ఉపయోగించుకుంటుంది. కొండగొర్రె మాంసం రుచిగా ఉంటుందన్న కారణంగా ఇవి ఎక్కువగా వేటగాళ్ల చేతిలో బలి అవుతుంటాయి.

ప్రమాదం అంచున..



కొండ గొర్రె కంటే కాస్త భారీగా, కణుతుల కంటే కాస్త చిన్నగా ఉండే మరో అంటిలోప్.. బుర్రజింక. చింకారా అనికూడా పిలిచే ఈ జింక తలపై రెండు కొమ్ములు కృష్ణజింకను పోలి పురి తిరిగి ఉంటాయి. కానీ వాటి అంత పొడవు పెరగవు. నల్లమలలో వీటి సంఖ్య బాగా తగ్గిపోయింది. అరుదుగా మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. రైతులు వ్యవసాయ ఉపకరణాలలో చింకారా కొమ్ములను అందంగా వినియోగిస్తుంటారు. చర్నాకోల పిడిగా, మోకులు, పగ్గాలు తయారు చేసేందుకు ఉపయోగపడే పరికరంగా కూడా వీటి కొమ్ములను రైతులు సేకరించే వారు.

సాంబర్ డీర్..



జింకలలో అతి పెద్దది కణితి(సాంబర్ డీర్). దట్టమైన అటవీ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా జీవిస్తుంటాయి. ఇవి పెద్ద పంగల కొమ్ములు కలిగి ఉంటాయి (మగవాటికి మాత్రమే కొమ్ములుంటాయి). ఈ కొమ్ములను అవి నిర్ణీత సమయంలో విసర్జిస్తుంటాయి. కొన్ని సార్లు ఆడ కణితి కోసం జరిగే పోరాటంలో అవి ఊడి పోతుంటాయి. నల్లమలలో ప్రధాన రక్షిత వన్యప్రాణి అయిన పెద్దపులికి ఆహార జంతువులుగా జింకలు పర్యావరణ సమతుల్యానికి తమవంతు కృషి చేస్తున్నాయి. జింకలతో పాటు అడవి పంది, ముల్ల పంది, కుందేలు వంటి జంతువులు కూడా పులి ఆహార మెనూలో ఉన్నాయి. కణుతులు ఎక్కువగా ఉండే ప్రాంతాన్ని పెద్ద పులులకు చక్కటి ఆవాసంగా గుర్తిస్తారు.

నేనూ జింకనే..



జింకకాని జింక ఈ మౌస్ డీర్. నిజానికి ఇది జింకజాతి వన్యప్రాణి కాదు. కాని రూపం బట్టి దీన్ని మూషిక జింకగా చెబుతారు. ఇది పంది జాతికి చెందిన ప్రాణి. వెనక కాళ్లు కాస్త బలహీనంగా కనిపించే ఈ జింక పూర్తిగా దట్టమైన వర్షారణ్యాలను పోలిన అడవుల్లో కనిపిస్తుంది. పెద్ద కుందేలు పరిమాణంలో ఉండే మూషిక జింక నల్లమలలోని గుండ్లబ్రహ్మేశ్వరం, రుద్రకోడు, పెచ్చెర్వు వంటి దట్టమైన పర్వతప్రాంత అడవుల్లో కనిపిస్తుంది. ఇది సాధారణంగా రాత్రుళ్లు మాత్రమే తిరుగాడుతుంది. చెట్టు తొర్రల్లో నివాసముంటుంది. నల్లమలలో ఇది అంతరించి పోయింది అనుకున్న సమయంలో తిరిగి కనిపిస్తుండటం శుభపరిణామం.

జీవవైవిధ్యంలో జింకలు కీలకం



నల్లమలలో ముఖ్య రక్షిత వన్యప్రాణి పెద్దపులి, ఆతరువాతి స్థానాల్లో ఉన్న చిరుత వంటి మాంసాహార జంతువులకు ఆహార సమృద్ధి కలిగిస్తూ మొత్తం పర్యావరణ సంరక్షణలో జింకలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. పెద్దపులికి నల్లమల ఆవాసంగా మారడంలో ఈ జింకలు కూడా ప్రధాన కారణం. నల్లమలలో జీవ వైవిధ్యంలో ఇవి కీలకంగా ఉన్నాయి.

– పట్టాభి, ఎఫ్ఆర్వో, ఆత్మకూరు రేంజ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


● స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి



రోడ్లపై చెత్తను తీస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఇంటితో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌లో భాగంగా కలెక్టర్ నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణమంతా కలియతిరిగి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్‌స్టాపులు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల నుంచి 12 నెలల పాటు నెలకు ఒక థీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జనవరి మాసానికి సంబంధించి న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ థీమ్‌తో కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. పట్టణాల్లో పెద్ద పెద్ద గార్బేజ్ పాయింట్లను తొలగించి వాటి స్థానంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా విభజించి తడి చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసి సంపద సృష్టించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దుకాణదారులతో మాట్లాడుతూ వేస్ట్ మెటీరియల్‌ను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్తకుండీల్లో వేసేందుకు పెద్దపెద్ద చెత్తకుండీలను ఏర్పాటు చేసి సైన్ బోర్డులు ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ వెంట స్వచ్ఛత కార్యక్రమంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రజియా సుల్తానా, డిపో మేనేజర్ గంగాధర్, వార్డు కౌన్సిలర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నంద్యాల మున్సిపల్ కార్యాలయము నుంచి మున్సిపల్ టౌన్‌హాల్ వరకు నిర్వహించిన స్వచ్ఛత భారీ ర్యాలీని కలెక్టర్ రాజకుమారితో పాటు ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో కలెక్టరేట్ ముఖ ద్వారం నుంచి పీజీఆర్ఎస్ సెంటినరీ హాల్, కలెక్టర్ కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

శ్రీశైలంప్రాజెక్ట్: ట్రైకార్‌తో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఏపీ పథకాలను తీసుకు వస్తే బాగుంటుంది అనే అంశంపై రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి (ఐటీడీఏ)లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్లు, సిబ్బంది, గిరిజన నాయకులు హాజరయ్యారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు గతంలో ఏపీ పథకాలు వర్తించాయి, వాటి కోసం ఎంత మొత్తం నిధులు వినియోగించారు తదితర అంశాలపై సమర్పించిన నివేదికలను పరిశీలించారు. ప్రస్తుతం ట్రైకార్ ద్వారా ఏపీ పథకాలను తీసుకు వస్తే బాగుంటుందనే అనే అంశంపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్లు పి.లావణ్య, టి.అనురాధ, పీఓ కె.వెంకటశివప్రసాద్, ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, స్టేట్ గవర్నింగ్ బాడీ కమిటీ సభ్యులు చెవుల అంజయ్య, భూమని మంతన్న, డీఈఈ రియాజ్‌అహ్మద్, జీసీసీ డీఎం పుల్లయ్య, హార్టికల్చర్ అధికారి బీసీ ధనుంజయ, ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.గుండాలనాయక్ పాల్గొన్నారు.

● ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పర్యవేక్షణలో గిరిజనులకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కొమరంభీం చెంచుగిరిజన సంఘం సభ్యులు వై.ఆశీర్వాదం, వీరయ్య, కొలమయ్య, లక్ష్మీదేవి, మూగమ్మ, వీరమ్మ తదితరులు ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు.

కన్నీటి దిగుబడి!

● మినుము రైతుల ఆశలు అడియాసలు
● జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగు
● వెంటాడిన చీడపీడలు
● పూత దశలో అకాల వర్షం
● ఎకరాకు రూ. 30 వేల పెట్టుబడి
● 5 క్వింటాళ్లలోపే దిగుబడులు
● లబోదిబోమంటున్న రైతులు



కలుగొట్ల సమీపంలో యంత్రం సాయంతో మినుము నూర్పిడి చేస్తున్న దృశ్యం



జోళదరాశి వద్ద ఆరబోసిన మినుము దిగుబడులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీసీజన్ రైతులకు కలిసిరాలేదు. సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు దిగుబడులపై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది విస్తారంగా సాగైన పప్పుశనగలో తుఫాన్ ప్రభావంతో పూత, పిందె రాలిపోయాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సాగైన మినుము పంట చేతికందటంతో కోత, నూర్పిడి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 69,842 ఎకరాల్లో మినుము సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఆయా ప్రాంతాల్లో వర్షాధారం, సాగునీటి వనరుల ఆధారంగా 44,958 ఎకరాల్లో ఈ పంట వేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 1,300 ఎకరాల్లో, సంజామల మండలంలో 1,162 ఎకరాల్లో, దొర్నిపాడు మండలంలో 603 ఎకరాల్లో, అవుకు మండలంలో 465 ఎకరాల్లో, ఉయ్యాలవాడ మండలంలో 413 ఎకరాల్లో, కొలిమిగుండ్ల మండలంలో 267 ఎకరాల్లో సాగైంది.

వెంటాడిన తెగుళ్లు

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విత్తనానికి ముందు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. దాదాపు 70 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా వర్షాభావ పరిస్థితులతో సాగు 45 వేల ఎకరాలకు పరిమితమైంది. 90 రోజుల పంట కాలం కలిగిన మినుములో విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 30 వేలు వెచ్చించారు. కౌలు రైతులపై కౌలు రూపంలో అదనంగా మరో రూ. 10 వేలు భారం పడింది. పైరు పూత దశలో ఉండగా తుఫాన్ ప్రభావంతో మోస్తరు వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. వర్షానికి తోడు రసం పీల్చు పురుగు, కాండం తొలుచు, పూతలో పురుగుతో పాటు బూడిద, బొంత తెగుళ్లు ఆశించాయి. ఈ తెగుళ్ల బారి నుంచి పైరును కాపాడు కునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. అయినా, పూత రాలిపోయి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే నాలుగున్నర క్వింటాళ్లకు మించి దిగుబడులు రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు, తెగుళ్లే కొంప ముంచాయని వారు వాపోతున్నారు.

గతేడాది ఆశించినస్థాయిలో దిగుబడులు

జిల్లాలో గతేడాది రబీ సీజన్‌లో 48 వేల ఎకరాల్లో రైతులు మినుము పంట సాగు చేశారు. విత్తనానికి ముందు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతోపాటు పైరు వివిధ దశల్లో వాతావరణం అనుకూలంగా మారటంతో మంచి దిగుబడులొచ్చాయి. ఎకరాకు రూ. 25 వేలు పెట్టుబడుల రూపంలో వెచ్చించగా ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడులు లభించాయి. గత ప్రభుత్వం విత్తనానికి ముందే క్వింటా రూ. 8 వేలు మద్దతు ధర ప్రకటించింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండటంతో రైతులు కల్లాల్లోనే పంటను విక్రయించి లాభాలు గడించారు. ఈ ఏడాది కోటి ఆశలతో మినుము సాగు చేయగా ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతీయడంతో దిగుబడులు తగ్గి నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మినుము సాగుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఈ ఏడాది మినుముసాగుతో దిగుబడులు తగ్గిపోయాయి. నాకున్న ఎనిమిది ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. గత ఏడాది ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ఈ ఏడాది చీడపీడలతో ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడులు రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ. 7 వేల నుంచి రూ. 8 వేలలోపు ఉంది. క్వింటాకు రూ. 10 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులు నష్టాల బారి నుంచి కాస్త బయటపడతారు.

– రామయ్య, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 80 సీట్ల కోసం 6,035 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,879 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 22 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లె, డోన్, కోవెలకుంట్ల, నంద్యాల, నందికొట్కూరులో కేంద్రాలు ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత , నంద్యాల సెయింట్ జోసెఫ్, ఎస్టీ సెయింట్ జోసెఫ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షల నిర్వహణను డీఈఓ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. అన్ని చోట్ల పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్

వెల్దుర్తి: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన గోవర్ధనగిరి గ్రామంలో రైతు ఆనంద్ సాగు చేసిన ఏటీఎం (ఎనీటైమ్ మనీ)పంట (365 రోజుల పంట దిగుబడులు, ఆదాయం) ఏ గ్రేడ్ మోడల్‌ను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమై రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన యూనిట్ల ప్రకారం ఈనెల 25లోపు లక్ష్యాలను సాధించాలన్నారు. ఆయన వెంట ఆశాఖ హెచ్‌ఆర్ భుజేశ్వరుడు, స్థానిక అధికారులు జనార్దన, మునిరాజు, పరమేశ్వరుడు, డిజిటల్ అసిస్టెంట్లు, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

భారీగా సారా బెల్లం స్వాధీనం



ఎక్సైజ్ తనిఖీల్లో పట్టుబడిన సారా బెల్లం

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం భారీ మొత్తంలో పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుమ్మితం తండా, ఎర్రకత్వ తండా గ్రామాల్లో ఉన్న నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు శని వారం ఆకస్మిక దాడులు చేశారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, ఎస్‌ఐ నవీన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ మధుసూదన్, ఈఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ ఇంద్రకిరణ్ తేజ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. గుమ్మితంతండా గ్రామ శివారులోని నాటుసారా కేంద్రాల్లో 2500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. అలాగే ఎర్రకత్వ తండా సమీపంలో సారాబట్టీ వద్ద ఆటోలో 225 కేజీల బెల్లం, 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు పాతబస్తీ కవాడి వీధికి చెందిన అహ్మద్, బెల్లం వ్యాపారి రాజశేఖర్‌ను అరెస్టు చేసి నాటుసారా రవాణాదారుడు శివ నాయక్ కోసం గాలిస్తున్నట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు.

పుల్లగుమ్మిలో లేగదూడల ప్రదర్శన



పశుపోషకులకు పాలక్యాన్, టానిక్స్ అందిస్తున్న డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు

వెల్దుర్తి: పుల్లగుమ్మి గ్రామ వెటర్నరీ ఆసుపత్రిలో శనివారం రాష్ట్రీయ గోకుల మిషన్ లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని డీఎల్‌డీపీ డీడీ పార్థసారథితో కలిసి పశుసంవర్ధక శాఖ జిల్లా డీడీ డాక్టర్ దుర్గా ప్రసన్న బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశువుల యజమానులకు ఉచితంగా పాల క్యాన్‌లు, పశువుల కోసం మినరల్ మిక్చర్స్, టానిక్స్ ఇచ్చారు. అనంతరం లేగదూడల ప్రదర్శనను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాటికి ఉచితంగా నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో కల్లూరు ఏడీ డాక్టర్ పార్థసారథి, పశువైద్యాధికారులు డాక్టర్ స్వాతి, డాక్టర్ శాంతలత, డాక్టర్ చంద్ర మోహన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాంకేతికం.. అద్భుతం

కర్నూలు సమీపంలో రైల్వేట్రాక్‌ను ఆధునీకరిస్తున్న యంత్రం





వృథా పరివేతలో భాగంగా...

రైల్వే ట్రాక్‌కు తరచూ కంకర, మట్టి, ఇసుక ఇవ్వకపోతే బలహీన పడుతుంది. ఈ క్రమంలో ట్రాక్‌కు శక్తిని ఇచ్చేందుకు అంటే బలహీనమైన వ్పుడల్లా కంకర, ఇసుక, మట్టిని ఇచ్చేందుకు బీసీఎం మిషన్ పనిచేస్తూ ఉంటుంది. ఈ మిషన్ ద్వారా పూర్తిగా మెకనైజ్డ్‌గా ట్రాక్‌కు కొత్తగా కంకర, మట్టి, ఇసుకను సమకూర్చవచ్చు. ఈ మిషన్.. ట్రాక్‌ను దాదాపు మూడు–నాలుగు మీటర్ల ఎత్తు వరకు ఎత్తి వృథాగా ఉన్న కంకర, ఇసుక, మట్టిని తీసేసి, మళ్లీ కొత్తగా వేస్తోంది. శనివారం బీసీఎం మిషన్ కర్నూలు రైల్వే స్టేషన్ పరిధిలోని ట్రాక్‌కు శక్తినిచ్చే పనిలో ఉన్న దృశ్యాలు ఇవీ.. –సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ట్రాక్‌ను బలోపేతం చేస్తూ..



కంకరను సరిచేస్తున్న కూలీలు

రిజర్వాయర్ భూములను ఆక్రమిస్తే చర్యలు

అవుకు: ఎవరైనా రిజర్వాయర్ భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని డోన్ ఆర్డీఓ నరసింహులు హెచ్చరించారు. అవుకు సమీపంలోని రిజర్వాయర్‌ను ఆనుకొని కొందరు నాపరాతి డిపోలు ఏర్పాటు చేసుకోవడమేకాక నిరుపయోగ రాళ్లను రిజర్వాయర్‌లో వదిలేస్తున్నారు. దీంతో రిజర్వాయర్ నీటి మట్టం తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న డోన్ ఆర్డీఓ నరసింహులు శనివారం ఎస్సార్బీసీ ఈఈ సురేష్ బాబుతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్ పరిధిలో ఉన్న భూమి ఎంతవరకు ఆక్రమణకు గురైంది, ఏయే సర్వేనంబర్లలో ఎంత భూమి ఉంది, ఆక్రమణదారులు ఎవరు తదితర వివరాలతో పూర్తి నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించి డిపోలను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే ఆక్రమణదారులు ఖాళీ చేయాలన్నారు. ఇప్పటికే చెర్లోపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఆక్రమణదారుల్లో అవుకు గ్రామానికి చెందిన గంద్రాయుడు, ఎర్రమల రామక్రిష్ణ, షేక్ అబ్దుల్లా(లంబు బాషా), ప్రేమ్ కుమార్, ఎస్ఎండీ హుస్సేన్, మహబూబ్‌పీరాలకు, అలాగే చెర్లోపల్లెకు చెందిన ఎం నాగపుల్లయ్య, కంబగిరి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, చాకలి మద్దిలేటి, వడ్డె గుర్రప్ప, కండక్టర్ పుల్లయ్య, ఉపేంద్రలకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, ఆర్ఐ వెంగల్ రెడ్డి, ఎస్సార్బీసీ సిబ్బంది , అవుకు పోలీసులు పాల్గొన్నారు.



అక్రమంగా ఏర్పాటు చేసిన నాపరాతి డిపోలను పరిశీలిస్తున్న డోన్ ఆర్డీఓ నరసింహులు, ఎస్సార్బీసీ ఈఈ సురేష్ బాబు

సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డీఓ

రిజర్వాయర్ భూముల్లో అక్రమంగా డిపోలను ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి శనివారం ఆక్రమణ ప్రదేశం వద్దకు రాకపోవడంతో ఆర్డీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆక్రమణదారుల్లో అవుకు గ్రామానికి చెందిన ఎర్రమల రామక్రిష్ణ నోటీసు తీసుకోలేదని ఆర్డీఓకు తెలియడంతో చెర్లోపల్లె వీఆర్‌ఓ సుబ్బరాయుడుపై మండిపడ్డారు. నోటీసులు తీసుకోకపోతే ఇంటికి అతికించటం లేదా ఆక్రమణదారుడి వాట్సాప్‌కు నోటీసులు పంపించాలనే విషయం కూడా తెలియదా అంటూ వీఆర్‌ఓపై మండిపడ్డారు. త్వరగా అతనికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

ఆటలాడుకుంటూ అనంతలోకాలకు...

● నీటి కుంటలో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు రాజేష్ (ఫైల్)

ఆస్పరి: ఆటలాడుకుంటూ నీటి కుంటలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పుటకలమర్రి గ్రామంలో బోయ రాజు, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజేష్ (6) ముత్తుకూరు దగ్గర ఉన్న ఎవర్ గ్రీన్ ప్రవేట్ పాఠశాలలో రెండో తరగతి చదవుచున్నాడు. సంక్రాంతి సెలవులు రావడంతో శనివారం తల్లిదండ్రుల వెంట బాలుడు రాజేష్‌తో పాటు నలుగురు బాలురు కూడా వెళ్లారు. తల్లిదండ్రులు పొలంలో పని చేసుకుంటుండగా బాలురందరూ ఆటలాడుకుంటూ పక్క పొలంలో ఉన్న నీటి కుంట దగ్గరకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు రాజేష్ కుంటలో పడగానే వెంట వెళ్లిన పిల్లలు తల్లిదండ్రులకు వెళ్లి విషయం చెప్పారు. వారు వెంటనే అక్కడకు వెళ్లి బాలుడిని బయటకు తీశారు. స్పృహ తప్పిపోయిన బాలుడిని చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు ఆదోనిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు సూచన మేరకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

హోరాహోరీగా..

● విజేతగా నిలిచిన నంద్యాల వృషభాలు

ఎమ్మిగనూరురూరల్: నీలకంఠేశ్వస్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం బండులాగుడు పోటీల్లో న్యూ కేటగిరిలో నంద్యాల పట్టణానికి చెందిన బారెడ్డి కేశవరెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ. 50 వేలు గెలుచుకున్నాయి. శనివారం సాయంత్రం విజేతలకు బహుమతులను తహసీల్దార్ శేషఫణి అందజేశారు. నందవరానికి చెందిన జిముకల మహేష్ వృషభాలు రెండవ బహుమతి రూ. 40 వేలు, డోన్ మండలం మల్యాల షేక్‌మైమున్నా వృషభాలు మూడవ బహుమతి రూ. 30 వేలు, గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు చెవిటి సుంకన్న వృషభాలు నాల్గవ బహుమతి రూ. 20 వేలు, పి.రుద్రవరం ఎల్లాగౌడ్ వృషభాలు ఐదవ బహుమతి రూ. 10 వేలు గెలుచుకున్నట్లు ఆర్గనైజర్లు రాందాస్‌గౌడ్, భాస్కర్, ఉరుకుందయ్యశెట్టి, చంద్రశేఖర్‌రెడ్డి, విరుపాక్షిరెడ్డి, మహేంద్ర, గురురాజదేశాయి, కాశీంవలి, నారాయణరెడ్డి, ఈరన్నగౌడ్ తెలిపారు. ఆదివారం పెద్దసైజు దూలం లాగు పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు.



విజేత నంద్యాల బారెడ్డి కేశవరెడ్డికి మొదటి బహుమతి అందజేస్తున్న తహసీల్దార్ శేషఫణి

ముగిసిన రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు

● హోరాహోరీగా ఫైనల్ పోటీ
● బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రకాశం, కర్నూలు జట్లు

పాదిలి రూరల్: పొదిలి ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న 28వ రాష్ట్ర స్థాయి జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్ షిప్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీలకు వివిధ జిల్లాల నుంచి బాలురు, బాలికలు కలిపి మొత్తం 32 జట్లు పోటీలో పాల్గొన్నాయి. శనివారం నిర్వహించిన సెపక్‌తక్రా పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం – కర్నూలు జట్లు నువ్వా–నేనా అన్న విధంగా తలపడ్డాయి. ఈ పోరులో ప్రకాశం జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి ప్రకాశం జట్టు, రెండో బహుమతి కర్నూలు జట్టు సొంతం చేసుకున్నాయి. మూడో బహుమతికి అనంతపురం, ఈస్టుగోదావరి జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకోగా, రెండో బహుమతిని ప్రకాశం జిల్లా జట్టు సొంతం చేసుకుంది. మూడో బహుమతికి విజయనగరం, అనంతపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జీ శ్రీనివాసులు, అమరనాథ్, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నంద్యాలలో జాతీయ స్థాయిలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



బాలుర విభాగంలో రెండో బహుమతి సొంతం చేసుకున్న కర్నూలు జట్టు

గ్రామీణ యువకుడికి ఆర్‌బీఐలో ఉద్యోగం

కౌతాళం: మండల పరిధిలోని కామవరం గ్రామానికి చెందిన బాలాజీ అనే యువకుడు ఆర్‌బీఐ(రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) అసిస్టెంట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన యువకుడు తన విజయం గురించి చెప్పారు. కామవరం గ్రామానికి చెందిన తుమ్మల వీరారెడ్డి ఆర్ఎంపీగా, ఎల్‌ఐసీ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆయన భార్య తుమ్మల దేవమ్మ ఇంట్లోనే చిన్నపాటి గాజులషాపు నడుపుతున్నారు. వీరి మొదటి కుమారుడు టి.బాలాజీ.. అప్లయిడ్ స్టాటిక్స్‌లో మాస్టర్ డిగ్రీని తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వావిద్యాలయం నుంచి 2020లో తీసుకున్నారు. హైదరాబాద్‌కి వెళ్లి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ మొదటి ప్రయత్నంలోనే (ఈఎస్‌ఐసీ) ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సురెన్స్ కంపెనీలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం పొందారు. ఉద్యోగంలో చేరి వారం గడవకముందే కర్ణాటక గ్రామీణ బ్యాంకులో ప్రోబేషనరీ ఆఫీసర్‌కు ఎంపికయ్యారు. కొన్ని రోజుల తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్లర్క్ ఉద్యోగానికి కూడా ఎంపికయ్యారు. వీటిలో చేరకుండా ఆర్‌బీఐ అసిస్టెంట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. గతేడాది సెప్టెంబర్ 23 నుంచి బెంగళూరులో ఆర్‌బీఐ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.



కుటుంబ సభ్యులతో బాలాజీ

కష్టమంతా నేలపాలు !

కృష్ణగిరి: ఈ ఏడాది అన్నదాతకు ఏ పంట కలిసి రావడం లేదు. కూటమి ప్రభుత్వం అన్నదాతలను విస్మరించడంతో నష్టాలు మూటకట్టుకుంటున్నారు. కొన్ని పంటలు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర లేక పోవడంతో అప్పులపాలవుతున్నారు. టమాట రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. రబీ పంట కింద సాగు చేసిన టమాట కోతకు వచ్చింది. ఈ సమయంలోనే ధర పతనం కావడంతో రైతులకు పెట్టుబడి కూడా చేతికందడం లేదు. కనీసం కూలీల ఖర్చు కూడా రాకపోవడంతో పొలాల్లోనే వదిలేస్తున్నారు.



పెనుమాడ సమీపంలో పొలంలోనే టమాట పండ్లను వదిలేసిన దృశ్యం

పండ్లతోట దగ్ధం

కాలిపోయిన పండ్ల మొక్కలు



దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండకు చెందిన సోమన్న అనే రైతు పండ్ల తోట శనివారం దగ్ధమైంది. ఇతనికి నల్లచెలిమల రెవెన్యూ పరిధిలో మూడు ఎకరాల భూమి ఉంది. అందులో ఏడేళ్ల క్రితం జామ, మామిడి, నారింజ, నిమ్మ, టెంకాయ రకాలకు చెందిన 1,250 మొక్కలు నాటి పెంచుతున్నాడు. దిగుబడి చేతికొచ్చే సమయంలో పొలం పక్కన రైతు గట్టుకు నిప్పు పెట్టాడు. అయితే ఆ మంటలు సోమన్న తోటకు వ్యాపించి దాదాపు 825 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమీప రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసేలోపే జరగాల్సిన నష్టం జరిగింది. దాదాపు రూ. 18 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు చెబుతున్నారు. తమ పొలం పక్కన ఉన్న వారే వ్యక్తిగత కక్షతో ఈ పనికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

విమానం ల్యాండింగ్‌కు మంచు అడ్డంకి

● బెంగళూరుకు తిరిగి వెళ్లిన ఇండిగో ఫ్లైట్

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో బెంగళూరు నుంచి వచ్చిన ఇండిగో విమానం తిరిగి వెళ్లిపోయింది. శనివారం ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి కర్నూలుకు ఇండిగో విమానం బయలుదేరింది. అయితే 10.50 గంటలకు ఆ విమానం కర్నూలు చేరుకోగా మంచు కప్పుకొని ఉండడంతో (విజుబులిటీ) ల్యాండ్‌కు అవకాశం ఇవ్వలేదు. దీంతో తిరిగి బెంగళూరుకు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అక్కడి నుంచి బస్సులు, రైళ్లల్లో చేరుకోవాల్సి వచ్చింది. ఏటా చలికాలంలో ఓర్వకల్ ఎయిర్‌పోర్టులో ఉదయం వేళ వచ్చే విమానాల ల్యాండింగ్‌కు వాతావరణం సహకరించడం లేదు. విమానాన్ని నడిపే పైలట్‌కు ఫిజికల్ 5 కిలోమీటర్ల వరకు విజుబులిటీ ఉంటేనే ల్యాండింగ్‌కు అవకాశం ఇస్తారు. అయితే ఇక్కడ చలికాలంలో 3 కిలోమీటర్ల వరకు మాత్రమే నేరుగా పైలట్‌కు విజుబులిటీ ఉండటంతో ల్యాండింగ్ సమస్య ఎదురవుతోంది.



శనగ పంటలో నీటి నిల్వలు ఉండనీయొద్దు



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

నంద్యాల(అర్బన్): శనగ పంటలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ అన్నారు. ఇటీవల శనగ పంటకు ఎండుతెగులు, మొదలు కుళ్లు, వేరుకుళ్లు తెగుళ్ల ఆశించాయని, వాటి నివారణకు ప్రతి మూడేళ్లకోసారి రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ మురళీకృష్ణ ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయాధికారులు పాల్గొన్న సమావేశంలో డీఏఓ జాన్సన్ మాట్లాడుతూ వంద కిలోల పశువుల ఎరువులో 2 కిలోల ట్రైకోడెర్మావిరిడి, 4 కిలోల వేపచెక్క నేలలో వేసి కలియేదున్నాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ శనగ పంట సాగుకు ముందు నేలను ఖాళీగా ఉంచకుండా సోయాబీన్, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేస్తే భూమి సారవంతమవుతుందన్నారు. కర్నూలు ఇన్‌చార్జ్ డీఏఓ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆత్మకూరు: మండలంలోని సిద్ధపల్లె డొంకలో శనివారం నాటుసారా తయారీ స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ డీవీ నారాయణ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, ఎవరైనా గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3,116	6,216
పొద్దుతిరుగుడు	4,530	4,530
ఆముదం	5,189	5,563
వాము	12,069	12,069
ఉల్లి	1,237	2,651
ఎండుమిర్చి	4,409	14,000
శనగలు	5,666	6,059
కందులు	3,000	8,001
మొక్కజొన్న	1,900	2,330
మినుములు	3,100	8,109
కొర్రలు	1,813	3,311
సోయాచిక్కుడు	3,311	3,311
సజ్జలు	2,059	2,359

ఫోన్ నం : 08518–257204, 257661